క్లుప్తంగా

నేతన్నకు ఆర్థిక సాయం



చెక్కు ఇస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న చేనేత కార్మికుడికి దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. చెన్నూరు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాగా బత్తిన శ్రీనివాసులు మాట్లాడుతూ చెన్నూరుకు చెందిన చేనేత కార్మికుడు కటికాల వెంకటరమణయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని నెల్లూరులోని దేవాంగ సంక్షేమ సంఘం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.33,020ల సాయం చేశారని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులు హరిక్రిష్ణ, కటికాల శేషు, మదిర బాలయ్య, రమణయ్య, కిరణ్, బాలగురవయ్య, భాస్కర్, పృథ్వీ, రాఘవ, చలమయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చిన్న బలరామయ్య

చిట్టమూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు. ఆయన గురువారం కొత్తగుంట మలుపు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు సూచించారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు: సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి గురువారం ఇసుక రీచ్‌ల కోసం కలవకూరు, పుల్లూరు ప్రాంతాల్లోని స్వర్ణముఖి నదిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి నది చెక్ డ్యామ్ వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల ఇసుక తవ్వకాలు చేపట్టే పరిస్థితి లేదన్నారు. అదేవిధంగా పుల్లూరు వద్ద కూడా స్వర్ణముఖి నదిలో వరద నీరు ఉండడం వల్ల రీచ్‌కు అవకాశం లేదన్నారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోషిణిబాయి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రాపూరు/దొరవారిసత్రం: గ్రామాల వారిగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అనీల్ కుమార్ తెలిపారు. రాపూరు మండలం పులిగిల పాడు, దొరవారిసత్రం మండలం ఏ కొల్లులో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులు, దూడలు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధిక టీకాలు వేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

దొరవారిసత్రం : ఈఎంఐ చెల్లించాలని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వేధించడంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. బూదూరు ఎస్టీ కాలనీకి చెందిన ప్రకాష్ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా ఈఎంఐ కింద రూ.8 వేలు చెల్లిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల ఈఎంఐ చెల్లించలేదు. కంపెనీ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి డబ్బు చెల్లించాలని నిలదీయడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు.

వాటర్ కూలర్ వితరణ

నాయుడుపేట టౌన్ : మేనకూరు సెజ్ పరిధిలోని కస్టమ్స్ అధికారి కొడవలి రవికుమార్ గురువారం నాయుడుపేటలోని వృద్ధాశ్రమానికి వాటర్ కూలర్ వితరణ చేశారు. వృద్ధులకు భోజనం పెట్టారు. భవిష్యత్తులో కూడా వృద్ధులకు సాయం చేయడానికి ముందుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండూస్ కాఫీ పరిశ్రమ ఉద్యోగి రాయపు నాగార్జున, ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్ని పాల్గొన్నారు.

నదిని తోడేస్తున్నారు



ఇసుకను లోడ్ చేస్తున్న జేసీబీ



కైవల్యా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ఉచిత పాలసీని అడ్డం పెట్టుకుని ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా కైవల్యా నదిలోని ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం.

- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలింపు
- భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి, సైదాపురం మండలాల్లో కైవల్యా నది ప్రవహిస్తోంది. ముఖ్యంగా బాలాయపల్లి, సైదాపురం మండలాల్లోని రామసాగరం, అనంతమడుగు, గంగదేవిపల్లి, పాలూరు, వేములచేడు, కమ్మవారిపల్లి, సైదాపురం, చీకవోలు తదితర గ్రామాల గుండా కైవల్యా నది ప్రవహిస్తోంది. ఇందులో నాణ్యమైన ఇసుక ఉంది. దీనికి ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీన్ని గుర్తించిన ఇసుకాసురులు కూటమి నేతల అండదండలతో ఇసుక రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఇసుకను గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

జేసీబీ పెట్టి యథేచ్ఛగా తవ్వకాలు

అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు బాలాయపల్లి, సైదాపురం మండలాల్లోని కైవల్యా నదిలో జేసీబీ పెట్టి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాడు. బహిరంగంగానే ట్రాక్టర్లలో ఇసుక నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు 100 ట్రాక్టర్లకు పైగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇలా ఇసుకను తోడేస్తే వేసవిలో నదిలో భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

రాత్రిళ్లు రవాణా చేస్తున్నారు

కైవల్యానది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపి రాత్రిళ్లు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. ఈ నదిని నమ్ముకుని చుట్టుపక్కల ప్రాంతాల రైతులు బోర్లు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇలా అయితే వేసవిలో పంటలకు నీరు దొరకదు.

– లేబాక వెంకట రమణయ్య, అనంతమడుగు, సైదాపురం మండలం



భూగర్భ జలాలు అడుగంటుతాయి

కైవల్యా నది నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. బోర్లలోంచి చుక్కనీరు కూడా వచ్చే పరిస్థితి ఉండదు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి.

– బి.శివకుమార్, ఉప సర్పంచ్ సైదాపురం, సైదాపురం మండలం



4న రథ సప్తమి వేడుకలు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో ఫిబ్రవరి 4న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పెనుశిల లక్ష్మీనసింహుడు రథసప్తమి నాడు సప్త వాహనాల్లో విహరించి భక్తులను అనుగ్రహిస్తారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీ 6గంటలకు సూర్యప్రభ వాహనం, 8 గంటలకు శేష వాహనం, 10 గంటలకు సింహ వాహనం, 12 గంటలకు గరుడ వాహనం, 2 గంటలకు చక్రస్నానం, 4 గంటలకు హనుమంత వాహనం, 6 గంటలకు అశ్వ వాహనం, 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారు ఊరేగుతారని వివరించారు.

అతివేగం ప్రమాదకరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు రూరల్ : అతివేగం ప్రమాదకరమని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్‌లో గురువారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణ, హెల్మెట్ వాడకం, అతి వేగంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. అలా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రవాణశాఖాధికారి కిషోర్, ఎంవీఐలు జకీర్, సునీల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డక్కిలి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. ఆమె గురువారం డక్కిలి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సమస్యలపై పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో కలిసి మెలిసి స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం డక్కిలి మండలం డి.ఉప్పరపల్లి (గొల్లపల్లి)లో అట్రాసిటీ కేసుపై విచారణ చేశారు. వెంటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ శివశంకర్ పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో పయనిద్దాం

వెంకటగిరి రూరల్ : మహాత్మాగాంధీజీ బాటలో నడిచి ఆయన ఆశయాలు సాధిద్దామని పలువురు వక్తలు తెలిపారు. వెంకటగిరిలో గురువారం గాంధీ వర్ధంతిని జరుపుకున్నారు. వెలమపాళెంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పు వీధిలో ఉన్న గ్రంథాలయంలోనూ నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, 21వ వార్డు కౌన్సిలర్ జి.ఢిల్లీబాబు, గ్రంథాలయ అధికారి అంజయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ గౌస్‌బాషా, సిహెచ్ హనుమంతు, షేక్ తాజుద్దీన్, మనయ్య, మనిబాబు, చంద్రశేఖర్, సతీష్, కాంతారావు, తాటిశెట్టి లీలావతి పాల్గొన్నారు.

డక్కిలిలో..

డక్కిలి : గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా డక్కిలి పోలీస్ స్టేషన్, తహసీల్దార్ తదితర కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ శివశంకర్, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్, డీటీ ప్రసన్న పాల్గొన్నారు.



వెంకటగిరి రూరల్ : గాంధీకి నేతల నివాళి

కోటలో

కోట: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కోట బజారువీధిలోని గాంధీ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. శిరిడీసాయి అక్షయ సేవా సమితి సెక్రటరీ ఆవుల సుబ్బయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : గాంధీ వర్ధంతి సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని గాంధీపార్కు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు నివాళులర్పించారు.



డక్కిలి: గాంధీకి నివాళులర్పిస్తున్న గూడూరు డీఎస్పీ



నాయుడుపేట టౌన్ : గాంధీజీ విగ్రహానికి వద్ద ఆర్యవైశ్య సంఘ నేతల నివాళి

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

డక్కిలి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డక్కిలి 1వ వార్డు సభ్యుడు మాదిరెడ్డి మునిరెడ్డి, పలువురు గ్రామస్తులు కోరారు. వరాట గురువారం తహసీల్దార్ ఎం శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డక్కిలికి చెందిన టీడీపీ నాయకుడు చెలికం నారాయణరెడ్డి గతంలో చెరువు పొరంబోకు స్థలంలో రేకుల షెడ్డు నిర్మించుకున్నాడని తెలిపారు. దాన్ని అధికారులు తొలగించారని తెలిపారు. అతనికి గ్రామంలో రెండస్తుల ఇల్లు, ఆర్‌వోఆర్ 1బీ ఖాతా నంబరు 225లో 2.54 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రేకుల షెడ్డు నిర్మించుకుని అందులో దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తుండగా అధికారులు దాన్ని తొలగించి తన బతుకుదెరువు పోగొట్టారని కోర్టును సైతం తప్పుదోవ పట్టించాడన్నారు. ఇప్పుడు సర్వే నంబరు 174లో రోడ్డు పొరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని వెల్లడించారు. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని గత ఏడాది ఆగస్టులో గ్రామపంచాయతీ తీర్మానం చేసినట్టు వివరించారు. ఆ స్థలం సుమారు రూ.15 లక్షల విలువ చేస్తుందన్నారు. స్పందించిన తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించి అక్రమ కట్టడాలపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న డక్కిలి గ్రామస్తులు

చెత్త సంపద కేంద్రాల తనిఖీ

ఓజిలి: మండలంలోని చెత్త సంపద కేంద్రాలను ఫిబ్రవరి 15వ తేదీలోపు వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామాలను శుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం ఆర్మేనిపాడు, చిలమానుచేను, కర్రబల్లవోలు, పెదపరియ, నెమళ్లపూడి గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి కేంద్రాలకు తరలించి ఎరువులు తయారుచేసి రైతులకు విక్రయించాలన్నారు. సర్పంచ్ పారిచర్ల సాయిరాం, ఈవోపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శులు శ్రీలక్ష్మి, దీప పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు విక్రయాలు ప్రారంభం

గూడూరు రూరల్ : చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని డీఎల్‌పీవో వెంకటరమణ తెలిపారు. ఆయన గురువారం గూడూరు రూరల్‌లోని వెందోడులోవున్న చెత్త సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు విక్రయాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోవున్న 16 చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈవోపీఆర్డీ మోహన్, డీఆర్పీ రవి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మారయ్య కాలనీలో తాగునీటి సమస్య

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని మారయ్య కాలనీ, ఎల్ఏ సాగరం గిరిజన కాలనీకి నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురైంది. మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాలేదు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్లతో అందజేస్తున్న నీరు తాగడానికి పనికిరావడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. విద్యుత్ మోటార్ తరచూ మరమ్మతులకు గురవుతోందని, అధికారులు స్పందించి కొత్త మోటార్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఉద్యాన పంటల సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన

డక్కిలి: రైతులు ఉద్యాన పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో చదువుతున్న నాలుగో సంవత్సరం విద్యార్థులు గురువారం డక్కిలి జెడ్పీ హైస్కూల్‌లో డక్కిలి, దేవునివెల్లంపల్లి, వెంపటవారిపల్లి గ్రామాల చెందిన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. పెట్లూరు చీని, నిమ్మ పరిశోధనా సంస్థ అధిపతి శ్యామ్‌సుందర్‌రెడ్డి, శిరీష, ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, డీన్ ఇన్‌చార్జి హరి మల్లికార్జున రెడ్డి, క్రాంధర్ నాయక్, ఎంఈవో–2 జగదీష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు పాల్గొన్నారు.



రైతు సదస్సులో విద్యార్థులు, శాస్త్రవేత్తలు

కన్యకా పరమేశ్వరికి సారె సమర్పణ

చిల్లకూరు: గూడూరులోని బజారు వీధిలో వున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గురువారం వాసవి మహిళా సమాజం వారు తొలిసారి బుట్ట సారె సమర్పించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో మహిళలు శివాలయం నుంచి 102 బుట్టల్లో సారె ఉంచుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.



ఆధార్ క్యాంపునకు విశేష స్పందన

చిట్టమూరు : మండలంలోని ఆరూరు సచివాలయంలో గురువారం నిర్వహించిన ఆధార్ క్యాంపుకు విశేష స్పందన లభించిందని ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. 28 మంది ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం వచ్చారని పేర్కొన్నారు. వారం రోజుల్లో వారి సెల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. ఆ తర్వాత ఆధార్ కార్డులు పొందవచ్చన్నారు. పచాయతీ కార్యదర్శి జనార్ధన్, వెల్ఫేర్ అసిస్టెంట్ కరీముల్లా, స్వప్న పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలి

పెళ్లకూరు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం పెళ్లకూరు ఎమ్మార్సీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువులు, మేకలు, గొర్రెలు మేపుతున్న, ఇటుక బట్టీల్లో పని చేసే వలస కార్మికుల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకరయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన

చిల్లకూరు : భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌ఐ పూర్ణ తెలిపారు. మండలంలోని మోమిడి గ్రామం గిరిజన కాలనీలో గురువారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలతో వెట్టి చాకిరి చేయించడంతో వారి భూములను ఆక్రమించుకుంటే అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సర్పంచ్ ఈదూరు లావణ్య, వీఆర్వో రామచంద్రయ్య, వెంకటక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మద్రాసు ఐఐటీ సర్టిఫికెట్లు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలోని పుదూరు అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యార్థినులు 12 మందికి ఐఐటీ మద్రాస్ నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారని ప్రిన్సిపాల్ రూత్ రోమోల గురువారం తెలిపారు. పిల్లలు రెండు నెలల పాటు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటాబేస్ ఆన్‌లైన్ కోర్సులో శిక్షణ పొందారని తెలిపారు. జనవరి 5న ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో 12 మంది ప్రతిభ చాటినట్లు వివరించారు. విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులు తన్నీరు శశికళ, జేఎల్ మ్యాథ్స్, ఒకేషనల్ ట్రెయినర్లు కొల్లి కమిత, పవిత్రను ప్రిన్సిపాల్ అభినందిచారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ

చిట్టమూరు : చిట్టమూరులో గురువారం వైద్యులు పద్మావతి ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలని కోరారు.

కుష్టువ్యాధిపై అవగాహన ఉండాలి

సైదాపురం: కుష్టువ్యాధిపై అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి నిత్య ప్రశాంతి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధిని ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సారకాయల శెట్టి న్నారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలపై వినతి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యలపై డీఆర్ఎం విశ్వనాథ్‌కు విన్నవించినట్టు డీఆర్‌యూసీసీ కమిటీ సభ్యులు పేర్నాటి జోసెఫ్ తెలిపారు. చెన్నైలోని సదరన్ రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన డీఆర్‌యూసీసీ సమావేశంలో జోసెఫ్ పాల్గొన్నారు. పలు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఆక్రమణల తొలగింపు

నాయుపేట టౌన్ : పట్టణంలోని పాత బస్టాండు నుంచి దర్గా వీధి వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను పోలీసులు గురువారం తొలగించారు. దుకాణదారులు రోడ్డును ఆక్రమించుకోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సీఐ బాబి పోలీసులతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తొలగించారు. ఇకముందు రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

చిల్లకూరు : పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు ఆపేది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఆయన గురువారం గూడూరులోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేదలకు స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి సహాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. దాని గురించి ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 9వ తేదీ వరకు పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని 10వ తేదీన ఆయా సచివాలయాల్లో అందజేస్తామన్నారు.